కథ

# సజాతి ధృవాలు

మొలుగు కమలాకాంత్

ఆ రోజు సోమవారం. ఆఫీసులో ఆర్నెల్లుగా ఖాళీగా ఉన్న మేనేజర్ సీటు ఆ రోజు నిండబోతూండడంతో కొంచెం హడావిడిగానే ఉంది ఆఫీసంతా.

రూరల్ ఏరియాగా, ఇంటీరియర్‌ప్లేస్ పరిగణించబడే ఆ ఊళ్లో ఫాక్షనిజం, తీవ్రవాదం భయంతో ఎవరూ ఇన్నాళ్లూ మేనేజర్‌గా వచ్చే సాహసం చెయ్యలేదు. ఇన్నాళ్లకి ఓ నరోత్తముడు తెగించి ఈ బ్రాంచ్‌కి రావడం అందరికీ ఒకింత ఆశ్చర్యాన్నే కలిగించింది. కొందరైతే 'ఆ... ఎన్నాళ్లు ఉంటాళ్లే' అంటూ పెదవి విరిచారు కూడా.

కానీ సీనియర్ అసిస్టెంట్ ఆనందవర్ధన్ స్థితి మరోలా ఉంది. ట్రాన్స్‌ఫర్ లిస్ట్ తను చూశాడు... తమకొచ్చే మేనేజర్ పేరు కె.పరంధామన్. ఆ పేరే మొన్న శనివారం నుంచీ తనని నిలువనీయటం లేదు. సీట్‌లో కూర్చునే జ్ఞాపకాల బూజు దులిపి, ఒక్కో పేజీ నెమ్మదిగా తెరిచే ప్రయత్నం చేశాడు.

''పరంధామా! నన్ను త్వరగా తీసుకుపో తండ్రీ'' అన్న బామ్మతో 'నేన్నిన్ను మోయలేను బామ్మా, నువ్వా నడవలేవు' అంటూ కృష్ణుడిలా పోజిచ్చేవాడు తన బాల్య స్నేహితుడు పరంధామయ్య.

''అమ్మా, నాకీ పేరు పెట్టారేంటమ్మా ఖర్మ... 'పరంధామయ్య' అనీ... ముసలాళ్ల గ్గానీ సూట్ గాని పేరు... ఛీ'' అంటూ తల్లిని విసుక్కుంటుంటే ''తప్పురా నాన్నా! అది మీ తాతగారి పేరు... చెంపలేసుకో'' అనేది బామ్మ.

చదువులో, ఆటపాటల్లో, వినోదాల్లో ఇద్దరిదీ ఒకటే బాణీ... తనని వాడు 'నందూ' అనీ, తను వాడినీ 'పరం' అని పిలుచుకునే వాళ్లు. ''ఆ పరంధాముడు గొప్పవాడని'' వాడంటే 'ఈ మనిషే గొప్పవాడని' వీడు అనే వాడు. అదొక్కటే వాళ్లిద్దరి మధ్య భేదాభిప్రాయం. అయినా ఒకరంటే మరొకరికి ప్రాణం... వల్ల మాలిన వాత్సల్యం, అనురాగం.

అంతా సజావుగా జరిగితే అది మానవ జీవితమెలా అవుతుంది? 'పరం' పదవ యేట తండ్రి యాక్సిడెంట్‌లో పోతే తల్లితో కలిసి మేనమావ దగ్గరికి 'కడప' వెళ్లిపోక తప్పలేదు.

పదేళ్ల పిల్లలిద్దరూ కన్నీరు మున్నీరుగా విలపించారు. ఉత్తరాలు రాసుకుందా మనుకున్నారు. ఏటా వేసవి సెలవుల్లో కలుద్దామనుకున్నారు. కానీ, ఏడాది తిరక్కుండానే పరం తల్లి పరమపదించడంతో మేనమావతో కలిసి వాళ్లు వేరే ఊరేదో వెళ్లిపోయారని తెలిసింది.

ఇది జరిగి దాదాపు ముప్ఫయ్యేళ్లు కావస్తోంది.

''ఏమోయ్ వర్ధన్! ఏమిటీ పగటి నిద్రా!'' అన్న కొలీగ్ వెంకట్ పిలుపుతో ఫ్లాష్ బ్యాక్ నించి బయటపడ్డాడు.

''అయినా తన పిచ్చికాకపోతే 'పరంధామ్' అన్న పేరు గల వాళ్లంతా తన 'పరం'మే అవ్వాలనెక్కడుంది?'' అనుకున్నా 'అయితే బాగుండునన్న ఆశ మాత్రం చావలేదు. చచ్చినా చావదు కూడా.

''ఆయన పేరు 'పరంధామన్' గదా.. మా వాడి పేరేమో 'పరంధామయ్య''... ప్చ్... వాడు కాదు'' అంది మనసు.

''నీ మొహంలే, ఎందుకు కాకూడదు? కడప నుంచి ఏ తమిళనాడో వెళ్లి అక్కడ 'పరంధామన్' అని మార్చుకోకూడదా ఏమిటీ? అన్నాడు ఆనందవర్ధన్ మనసుతో

ఈ సంఘర్షణ ఆగేది కాదు.

''హు... ఎంత ఆలోచిస్తే ఏమి లాభం? వచ్చే వాణ్ణి చూసినా ముప్ఫై ఏళ్ల తర్వాత గుర్తు పట్టగలనా?'' అనుకున్నాడు.

''పైగా వచ్చేవాడు బాస్.. ఆ వచ్చేవాణ్ణి 'ముప్ఫై ఏళ్ల క్రితం నీ ఊరేది?' అంటూ ప్రశ్న లేస్తే, వాడు తన 'పరం' కాకపోతే నానా గోల. మూర్ఖుడైతే ఉన్న ఉద్యోగంలోనే చికాకులు కూడా రావచ్చు.

వర్ధన్ మనసు పరిపరివిధాల పోతోంది. అటెండర్ సింహాచలం 'కొత్తయ్యగా రొచ్చేశారు' అంటూ చాటింపేశాడు. కార్‌లో నుంచి దిగి హుందాగా నడిచి వస్తున్నాడు 'పరంధామన్', బ్రాంచ్ మేనేజర్.

చూశాడు వర్ధన్.... కళ్ల జోడు తీసి చూశాడు... అద్దాలు తుడుచుకుని మళ్లీ జోడు పెట్టుకుని మరీ చూశాడు... గుబురు మీసాలు, స్నఫ్ కలర్ సూట్, కళ్ల జోడు, టై... రాయల్‌గా ఉన్నాడు. దాదాపు నలభై ఏళ్ల వయసులో బ్రాంచ్ మేనేజర్ పరంధామన్.

'ప్చ్... లాభం లేదు' వయసు తప్ప ఇంకేదీ టాలీ అయి చావట్లేదు... ఎలా టాలీ అవుతుంది? పదేళ్ల వయస్సులో చూసిన వాణ్ణి ముప్ఫై ఏళ్ల తరవాత గుర్తు పట్టడం... కన్నతల్లికైనా సాధ్యమా?

'కనీసం పేరైనా సరిగ్గా టాలీ కాలేదు' అనుకుంటూ ఉండగానే ''ఈయన మిస్టర్ వర్ధన్, సీనియర్ అసిస్టెంట్'' పరిచయం చేశాడు ఆఫీసర్ రాజు.

'హలో' అంటూ కరచాలనం చేశాడు పరంధామన్

''నైస్ మీటింగ్ యూ సార్'' అప్రయత్నంగా అనేశాడు ఆనందవర్ధన్... ఆ కర స్పర్శలో ఏదో ఆప్యాయత.

అంతా తన భ్రమ... కాదు... ఆశ... ఆయన పేరు అదికాకపోతే ఈ కనుస్పర్శలూ, కర స్పర్శలూ ఏ ప్రభావాన్నీ కలిగించేవి కావేమో!''

అయినా ఏదో మూల... ఎక్కడో దీపమంత ఆశ... ఆ పూట వర్ధన్ సరిగ్గా భోజనం కూడా చేయలేదు. రోజంతా అన్యమనస్కంగానే ఉన్నాడు.

కొత్త బ్రాంచ్ మేనేజర్ ఇచ్చిన పార్టీ కూడా ఆనందంగా స్వీకరించలేక పోయాడు.

ఇంటికొస్తే, పిల్లల హోమ్‌వర్క్... భార్య నోములు, వ్రతాలు తనలో గల తేడాని గుర్తించనివ్వలేదు. ఆనంద్ కూడా ''ఆ ... ఈ సంగతి తనకి కూడా చెప్పి 'మూడ్' పాడు చేయడమెందుకులే'' అనుకుని ఊరుకున్నాడు... ఆలోచిస్తూనే పడుకున్నాడు.

ఇలా రెండ్రోజులు గడిచాయి.

ఆ రోజు గురువారం – మధ్యాహ్నం నించీ పబ్లిక్ ట్రాన్సాక్షన్స్ లేక పోవడంతో బ్రాంచ్ మేనేజర్ స్టాఫ్ మెంబర్స్ అందర్నీ ఇండివిడ్యుయల్‌గా ఛాంబర్‌లోకి పిలిచి మాట్లాడుతున్నాడు.

తన వంతు వచ్చేలోగా వెయ్యి ఆలోచనలు. ఛాంబర్‌లో అడుగు పెట్టాడు.

''మిస్టర్ వర్ధన్... యు ఆర్ ది సీనియర్ మోస్ట్ ఎంప్లాయీ ఆఫ్ దిస్ బ్రాంచ్... యామై కరెక్ట్!''.

''యస్సర్''... ఈ అప్రోచ్... అనుకుంటూ ఏదో ఆలోచించబోతుండగా... కట్ చేస్తూ...

''మీ పూర్తి పేరు చెబుతారా?''

Story

'ఎందుకబ్బా' అనుకుంటూనే 'కవివరపు ఆనంద వర్ధన్' టీచర్‌కి చిన్న పిల్లాడు చెప్పినట్లు చెప్పాడు.

''అయితే మీకు 'కనకదండి పరంధామయ్య తెలుసా?'' ఆ ఒక్క ప్రశ్న సెకన్లో కోటి ఆలోచనలు రేపింది.


తన ముందున్నది వేరెవరోకాదు. సాక్షాత్తూ తన 'పరం'... ఇన్నేళ్లుగా తానెదురు చూస్తున్న తన 'పరం' అని గ్రహించడానికి క్షణకాలం కూడా పట్టలేదు.

''అయితే మీరూ...'' కళ్లు ఆనందంతో వర్షిస్తున్నాయి.

''ఇంకా మీరూ ఏంట్రా ఫూల్... నేనేరా నీ పరాన్ని.. ఒరేయ్ నందూ...'' గాఢంగా కౌగిలించుకున్నాడు.

పరంధామన్ ఎలియాస్ పరం కూడా ముప్ఫై ఏళ్ల నాటి మిత్రుని సాంగత్యంలో కళ్ల నీళ్ల పర్యంతమయ్యాడు.

నిన్ను మొన్నే గుర్తు పట్టాన్రా... నీ కర స్పర్శ నన్ను మూడు దశాబ్దాల వెనక్కి తీసికెళ్లింది. కొలీగ్స్‌ని అడుగుదామంటే నువ్వే సీనియర్‌వి ఇక్కడ. దాంతో జోనల్ ఆఫీస్‌ని కాంటాక్ట్ చేసి నీ పర్సనల్ ఫైల్ తీయించి బాక్‌గ్రౌండ్ అంతా సేకరించడానికి ఈ 2,3 రోజులు పట్టింది'' అన్నాడు పరం చెమర్చిన కళ్లతో. ఇక నందు ఆనందానికి అవధుల్లేవు.



అదే కర స్పర్శ తనకీ మూడు రోజుల పాటు కంటి మీద కునుకులేకుండా చేసింది. 'ఈనాటి ఈ బంధమేనాటిదో' అని ఆత్రేయ గారు ఊరికే రాశారా! అనిపించింది.

తన 'పరం' తన పరమయ్యాడన్న ఆనందంతో నందూ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. వాళ్లిద్దరూ మూడు దశాబ్దాల ముఖ్య విషయాలని టూకీగా మాట్లాడుకుని 'కల ఇక' అనుకున్న తమ 'కలయిక' సందర్భంగా స్టాఫ్‌కి పార్టీ కూడా ఇచ్చారు.

''ఏరా... నేనుండగా నువ్వు మరో చోట భోం చేస్తావా? నాన్సెన్స్.. నువ్వు ఫ్యామిలీ షిఫ్ట్ చేసిందాకా మా ఇంట్లోనే...'' అన్నాడు నందు.

''ఒరేయ్ చూడు. సర్‌ప్రైజ్‌గా ఇన్నాళ్లకి కలిశాం. అలాగే మా శ్రీమతితో సహా వచ్చి మీ శ్రీమతిని సర్‌ప్రైజ్‌గానే కలుస్తాన్రా'' అన్నాడు పరం.

''అది కాదురా..''.

''నువ్వింకేం మాట్లాడకు... నా సంగతి తెలుసుగా.. మాటంటే మాటే''

''హు... నీ కింకా ఆ చిన్నప్పటి మంకుతనం పోలేదురా. సరే.. నీ ఖర్మ.. ఏడు''

''మరీ అంతగా ఉడుక్కోకురా... కావాలంటే, నేను మీ ఇంటికొస్తాను గానీ... మన కథ మాత్రం తనకి చెప్పకూడదు. నన్ను జస్ట్ మీ బీఎంగా పరిచయం చెయ్యి... చాలు'' అన్నాడు పరం.

ఈ రకంగానైనా మిత్రుడు ఇంటికొస్తానన్నందుకు ఎంతో సంతోషించాడు నందూ.

''అలాగే రే... రేపు సాయంత్రమే నువ్వు రావాలి మరి''.

''ఓకే... కానీ నా షరతు గుర్తుందిగా''

''గుర్తుంది మహాప్రభో... మొండి వెధవ గారూ''.

''హహ్హహ్హా..'' హాయిగా నవ్వేశాడు పరం, బ్రాంచ్ మేనేజర్. శృతి కలిపాడు ఆనంద వర్ధన్, ఎలియాస్ నందూ.

***

ఆ రోజు శుక్రవారం. సాయంత్రం ఆరు దాటుతోంది. 'ఈయనింకా రాలేదు. బ్రాంచ్ మేనేజర్‌ని తీసుకొస్తానన్నారాయె' అనుకుంటూ లలిత హడావిడి పడుతోంది.

పిల్లలొచ్చి టిఫిన్ చేసి ట్యూషన్లకి వెళ్లిపోయారు.

బ్రాంచ్ మేనేజర్‌లందరికీ గారెలే ఇష్టమవుతాయన్న యూనివర్సల్ రూల్ ఏదో ఉన్నట్లు తన భర్త చెప్పటం లలితకి ఒకింత ఆశ్చర్యం కలిగించక పోలేదు.

ఇంతలో కార్ రానే వచ్చింది. ఇంట్లోకి రాగానే భర్తచేసే హడావిడి తెలిసిన లలిత హడావిడిగా వంటింట్లోకి వెళ్లి గారెలు వేసే పని ప్రారంభించింది.

''ఏరోయ్... నా రుచులు నీకింకా బానే గుర్తున్నట్లున్నాయ్... గారేలేనా?'' ఘుమఘుమలు వాసనచూస్తూ 'నెమ్మదిగా' అడిగాడు పరం. నవ్వాడు నందుడు.

''లలితా మంచినీళ్లు పట్రా'' అరిచినంత పని చేశాడు.

మంచినీళ్ల ట్రేతో అడుగు పెట్టిన లలితని ''తను, నా

భార్య లలిత.... లలితా, వీరు మా బ్రాంచ్ మేనేజర్ పరంధామన్'' అంటూ పరిచయం చేశాడు.

ఇరువురి చూపులు కలిశాయి... అంతే...

ఓ పెద్ద విస్ఫోటనం... మానసికాగ్ని పర్వతంలో భావాల లావా పొంగి పొరలింది. అన్యమనస్కంగా 'నమస్తే' అని లలిత లోపలికి వెళ్లి పోయింది. వాతావరణమే మారిపోయింది.

తనకిష్టమైన గారెలు రెండు కూడా తినని పరాన్ని అదోలా చూశాడు నందూ.

'వెళ్లొస్తారా' ముక్తసరిగా అంటూ ఏదో అర్జెంట్ పనున్న వాడిలా వెళ్లిపోతున్న పరాన్ని బొమ్మలా చూస్తూ ఉండి పోయాడు.

తన భార్య చేతి గారెలు ఎంత అద్భుతంగా ఉంటాయో తెలిసిన నందూ, సడెన్‌గా పరంధామన్ ఫీలింగ్స్‌లో వచ్చిన మార్పులకి కారణాలు వెదుకుతూ ఇంట్లోకొచ్చాడు.

అగ్గిమీద గుగ్గిలమయ్యింది లలిత.

''ఎందుకండీ... ఓ... బ్రాంచ్ మేనేజర్ అంటూ ఇంటికి తీసుకొచ్చారు.. ఎవడికీ లేని పిచ్చి మీకెందుకు? ఓ మంచీ, మర్యాద తెలియని మనిషీ... ఛీ'' విసురుగా పెరట్లోకి వెళ్లింది.

''ప్చ్... సమ్‌థింగ్ రాంగ్'' అనుకున్నాడు నందూ.

***

ఆ మర్నాడు ఆఫీసుకెళ్లిన నందూకి తమ బ్రాంచ్ మేనేజర్ 15 రోజులు లీవ్ పెట్టి వాళ్ల ఊరెళ్ళాడన్న వార్త అశనిపాతంలా తగిలింది.

తనకి చెప్పకుండా తన 'పరం' వెళ్లిపోయాడు. ఇంట్లోనేమే లలితకు ఎందుకో తెలీని కోపం. కదిలిస్తేనే కస్సుమంటోంది. ఈ టెన్షన్ తట్టుకోలేక పోయాడు నందూ.

ఏమైతే అయిందని, తనూ బయల్దేరి 'పరం' వాళ్ల ఊరెళ్లాడు. నానా ఎంక్వైరీలు చేసి ఇల్లు కనుక్కొని కాలింగ్ బెల్ నొక్కాడు.

తలుపు తీసింది అరుంధతి.

''అరూ... నువ్విక్కడ...'' అను చూస్తున్నది కలో, నిజమో అర్థం కాని స్థితిలో మళ్లీ ఒకసారి నేమ్ ప్లేట్ చూశాడు. కె.పరంధామన్, బ్రాంచ్ మేనేజర్.. అని తమ కంపెనీ పేరు స్పష్టంగా రాసి ఉంది.

''ఆనంద్... నువ్వా... ఎన్నాళ్లకీ...'' ఆశ్చర్యపోవడం అరుంధతి వంతైంది.

''నువ్వా... ఇక్కడా..''

''యస్... ఏ. కాకూడదా? మా వారు సమాజానికి భయపడే పిరికి వారు కారు ఆనంద్... సర్లే.. ఇప్పుడు అనవసరంగా దశాబ్దానికి పైగా వెనక్కి ఏం వెళ్తాం లే గానీ, కబుర్లు చెప్పు'' మంచి నీళ్లిచ్చింది.

ఆనంద్ ఆలోచనలు దశాబ్దం వెనక్కు వెళ్లాయ్... అవును.. తన వర్శి పిరికివాడు. తల్లిదండ్రులకీ, సమాజానికీ భయపడి యూనివర్శిటీలో ఉండగా తాను ప్రేమించిన... అంతకంటే ముఖ్యంగా తనని ప్రేమించిన అరుంధతిని వదిలి పిరికివాడిలా పారిపోయాడు.

''ఇంకా ఏమాలోచిస్తావ్‌లే గానీ, కాఫీ తాగు'' అరుంధతి ప్రతి మాటా శూలంలా తగులుతుంటే, కాఫీ ముగించి–

''మీ వారు మా బ్రాంచ్ మేనేజర్... కలుద్దామని వచ్చాను'' పొడిగా అన్నాడు.

''ఓ అరగంటలో వస్తారు... ఫోన్ చెయ్యనా...''

''వద్దు వద్దు... మళ్లీ వస్తా...'' అన్నాడో,, తనలోనే అనుకున్నాడో... ఇంక అక్కడ ఉండలేక పోయాడు... నెమ్మదిగా నిష్క్రమించాడు.

''హు... ఇదేనా జీవితమంటే... ఎన్నిమలుపులు ... ముప్పై ఏళ్ల నాడు దూరమైన తన మిత్రుడు, పదిహేనేళ్ల క్రిందటి తన ప్రియురాలు భార్యాభర్తలుగా ప్రత్యక్షం కావడం.. నవ్వాలో, ఏడవాలో తెలీని స్థితి'' అనుకున్నాడు.

సాయంత్రానికి నీరసరంగా ఇల్లు చేరాడు. లలితతో ఏమీ మాట్లాడకుండా, భోజనం చేశాననిపించి పడుకున్నాడు.

మర్నాడాదివారం చుట్టాలు రావడంతో హడావిడిగా గడిచి పోయింది.

మరుసటి రోజు ఆఫీస్‌కి వెళ్లిన నందుకి కొరియర్‌లో ఉత్తరం వచ్చింది. కవర్ చింపి, ఉత్తరం తీశాడు.

''ఒరేయ్ నందూ... ఈ పిలుపు నాకు ముప్పైఏళ్ల పాటు దూరమైందిరా! ఆఫీసులో నిన్ను చూశాక ఆనందాంబుధి అవధులు లేకుండా సాగింది. కానీ మొన్న మీ ఇంటికి వచ్చాక 'ఆ విరహమే కొనసాగితే' ఇంకెంత మధురంగా ఉండేదే కదా!'' అనిపించిందిరా!

> **అరుంధతి యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఎవర్నో ప్రేమిస్తే సమాజానికి భయపడి వాడు తన కన్యాయం చేసి, మరో పెళ్లి చేసుకోవడంతో, తను ఎప్పుడూ డిప్రెషన్‌లో ఉండేది. ఈ సంగతి తెలిసిన వారెవ్వరూ తనని చేసుకోవటానికి ముందుకి రాలేదు.**

నీ దగ్గర నిజాన్ని దాచలేని బలహీనత నాచేత ఈ లేఖ రాయిస్తోంది. నిబ్బరంగా చదువు.

ఇంతకీ అసలు విషయం.

పన్నెండు... పదమూడేళ్ల క్రితం లలిత, నేనూ ప్రేమించుకున్నామురా..''

ఒక్కసారి ఒళ్లు ఝల్లుమంది నందూకి.

''అవున్రా... చిన్నప్పటినుంచీ తనే తల్లిదండ్రీ అయి నన్ను పెంచిన మేనమావ.. నీకు తెలుసుగా... ఆయన హార్ట్‌ఎటాక్ వచ్చి పోతూ పోతూ, డీప్ డిప్రెషన్‌లో ఉన్న తన కూతురు అరుంధతిని పెళ్లి చేసుకోమని చెప్పి, ఒట్టేయించుకుని మరీ పోయాడు.

అరుంధతి యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఎవర్నో ప్రేమిస్తే సమాజానికి భయపడి వాడు తన కన్యాయం చేసి, మరో పెళ్లి చేసుకోవడంతో, తను ఎప్పుడు డిప్రెషన్‌లో ఉండేది. ఈ సంగతి తెలిసిన వారెవ్వరూ తనని చేసుకోవటానికి ముందుకి రాలేదు.

నన్ను మనిషిని చేసిన మేనమావ రుణం తీర్చుకోవటం కోసం లలితతో నా ప్రేమని త్యాగం చెయ్యక తప్పలేదు.

ఒకరి కోసం త్యాగం... మరొకరికి ద్రోహం....

ఈ విషయం విన్న లలిత నన్ను అసహ్యించుకుని వెళ్లి పోయింది.

అరుంధతిని ప్రేమించి మోసం చేసినవాడి గురించి ఈనాటికీ తనని అడగలేదు. లలితతో నా ప్రేమసంగతీ తనకి చెప్పలేదు. 'డిప్రెషన్‌లో ఉన్న తనకి ఇలాంటివెందుకు చెప్పడం?' అనిపించింది.

కానీ, లలితని నీ భార్యగా చూశాక, నా ప్రవేశం పచ్చని మీ కాపురాన్ని కల్లోల పరస్తుందనిపించింది. నారాకతో, ఎలాగూ విషయం బయటపడి అందరి జీవితాలూ దుర్భరమవుతాయన్న భయం. అందుకే, సెలవు పెట్టాను. ఏదైనా దూరప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లి పోతాను. మళ్లీ నీకు నా ముఖం చూపించలేను.

విరహము, వియోగంలో ఉన్న సుఖం కలయికలో ఉండదని మరోసారి రుజు వైందిరా... కలిసి ఉండడం వల్ల జీవితాలు అల్లకల్లోలం కావడం కంటే, దూరంగా ఉండడం వల్ల ప్రశాంతంగా ఉండటమే బెటర్.

అందుకే... మనమిక కలవద్దురా... గతాన్ని మర్చిపోయి... బాల్యాన్నే గుర్తుంచుకుని గత మూడు దశాబ్దాల్లోలాగా విరహంలోనే సుఖాన్ని పొందుదాము.

నన్ను క్షమిస్తావు కదూ! ఉంటాన్రా... ఎప్పటికీ

...పరం...

నందూ ఆ ఉత్తరాన్ని ఆసాంతం వందసార్లకి పైగా చదివాడు.

మనసు అల్లకల్లోలమయ్యింది.

తన ప్రేయసి 'పరం' భార్య.... 'పరం' ప్రేయసి తన భార్య.

తను సమాజం కోసం (!) 'అరూ'ని మోసం చేస్తే, తన పరం కృతజ్ఞత కోసం (!) లలితకు ద్రోహం చేశాడు. అంతా భగ్న ప్రేమికులే.

పన్నెండేళ్ల క్రిందట, తనే గనక సమాజానికి భయపడకపోయుంటే – తన అరుంధతి తనదయ్యేది... 'పరం' లలితని చేసుకుని ఉండేవాడు... తనూ... పరం పుష్కరం క్రిందటే కలుసుకుని ఉండేవారేమో....

బంధువులై ఉండే వారు.

తన పిరికితనం నలుగురి జీవితాలపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపిందో కదా!

'ఏకవీర' సినిమా గుర్తొచ్చింది. కానీ ఇది జీవితం.

చిన్నప్పుడు తనూ, పరం ఒకే విషయంలో విభేదించే వాళ్లు.

తాను 'మానవుడే గొప్ప వాడం'టే, వాడు మాత్రం 'కాదు... ఆ పరంధాముడే... జగన్నాటక సూత్రధారి... అందరికంటే గొప్పవాడ'నే వాడు.

***

''ఓడి పోయాను పరం.. నీ మాటే నిజం.... విధి ఆడించిన వింత నాటకంలో మనిద్దరం ఓడిపోయాము రా పరం.... సమాజానికి భయపడి, నీ మరదలు (భార్య) అరూకి అన్యాయం చేసిన ఆ దౌర్భాగ్యుణ్ణి నేనేరా.

అందుకే నీ నిర్ణయంతో ఏకీభవిస్తున్నాన్రా... అసలు మనం కలుసుకోకుండా ఉంటేనే ఎంతో బావుండేదనిపిస్తోంది.

సజాతిధృవాలు వికర్షించుకుంటాయన్నది భౌతిక శాస్త్ర పరంగానే కాదు మానవ శాస్త్ర ప్రకారమూ అక్షర సత్యమని రుజువైందిరా మన విషయంలో.

ఇంక ముందు ముందు మనం కలవద్దు.

విరహంలోనే హాయిని ఆస్వాదిద్దాము.

.... ఎప్పటికీ నీ నందూ....

నందూ ఉత్తరాన్ని వంద సార్లు చదివిన పరం దీర్ఘంగా నిశ్వసించాడు.

*